## క్లుప్తంగా

### రేపు డాక్టర్ వైఎస్సార్ ఆసరా సంబరాలు

**గుంటూరు రూరల్:** తురకపాలెంలోని డబ్బూరివారి కల్యాణ మండపంలో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు డాక్టర్ వైఎస్సార్ ఆసరా 3వ విడత సంబరాలను నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి శోభరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగే ఈ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. లబ్ధిదారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ప్రతి ఒక్కరికీ ఉపాధి లక్ష్యంగా పనిచేయాలి



**కాకుమాను:** మండలంలోని గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే విధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది పనిచేయాలని ఏపీడీ శ్రీమన్నారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపాధి కల్పించి వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించడంతో పాటు జాబ్ కార్డులు లేని వారిని గుర్తించి వారికి కూడా కార్డులు మంజూరు చేసి ఉపాధి కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ శింగారావు, సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

### వ్యాపారవేత్తకు డాక్టరేట్



**గుంటూరు రూరల్:** చినపలకలూరు గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బొందలపాటి వెంకటేశ్వరరావుకు పాండిచ్చేరిలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు శనివారం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానికులు వెంకటేశ్వరరావును అభినందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి యూనివర్సిటీ అతనికి డాక్టరేట్ అందజేయడం సంతోషకరమన్నారు. వ్యాపార రంగంతో అంచెలంచెలుగా ఎదిగిన తాను పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తనవంతు సేవలు అందిస్తానన్నారు.

### మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

**నెహ్రూనగర్:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డెప్యూటీ మేయర్ షేక్ సజీల కోరారు. ఈ మేరకు శనివారం మేయర్ కావటిని ఆయన చాంబర్‌లో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ మాట్లాడుతూ మసీదుల వద్ద వీధి దీపాల సమస్య లేకుండా కోరారు. ఉదయం 3 గంటల నుంచి సెహరి చేస్తున్న క్రమంలో హలీం పాయింట్లు 24 గంటలు నిర్వహించుకునేందుకు పర్మిషన్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

### ఆకట్టుకున్న కచేరీ

**పాత గుంటూరు:** బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వాద్య సంగీత కచేరీ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కార్యక్రమానికి ఆలయ సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. పాఠశాల విద్యార్థులు వయోలిన్ వాద్య విభావరి ఆకట్టుకుంది. అనంతరం పారుపల్లి ఇబానసన్‌మాండలిన్‌పై, పారుపల్లి ప్రభవస్ వేణువుపై కర్ణాటక సంగీత శైలిలో పలు త్యాగరాజ, అన్నమయ్య కీర్తనల్ని పలికించారు. నృత్య పాఠశాల కూచిపూడి నృత్య అధ్యాపకుడు బి. సురేష్‌బాబు మృదంగంపై, డోలు అధ్యాపకుడు ఎం. హరిబాబు ఘటంపై సహకరించి కచేరీని రక్తికట్టించారు. కార్యక్రమాల్ని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. హరిబాబు పర్యవేక్షించారు.

# పౌష్టికాహారంతో ఆరోగ్యం

**జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు**



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు

**గుంటూరురూరల్:** ప్రతి గర్భిణి, బాలింత ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం చిన్నపలకలూరు గ్రామంలోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య భద్రత, పౌష్టికాహార లోపంతో వచ్చే రుగ్మతలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజాభివృద్ధికి కృషి చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత భవిష్యత్తును పొందాలని ఆకాంక్షించారు. అనంతరం జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య భద్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక, తురకపాలెం సొసైటీ చైర్మన్ తంగెళ్ల నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి రాయల్, డేగల శివనాగేశ్వరరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్


నిందితుడు గంటా రాజశేఖర్‌తో ఎస్ఈబీ సిబ్బంది

**పెదకాకాని:** కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలించిన మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు గుంటూరు ఎస్ఈబీ సీఐ ఎం.రమేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకాకాని గ్రామానికి చెందిన గంటా రాజశేఖర్, ఫణికుమార్ బట్టల వ్యాపారం పేరుతో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. గంటా ఫణికుమార్ కర్ణాటకలో ఉంటూ ట్రావెల్స్ బస్సులు, లారీల్లో దుస్తులు గుంటూరుకు ట్రాన్స్‌పోర్ట్ చేస్తూ ఉంటాడు. అనుమానం రాకుండా దుస్తుల మధ్యలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లు ప్యాక్ చేసి పంపిస్తున్నాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో గతంలో రెండు సార్లు తనిఖీ చేశారు. అయినప్పటికీ ఎటువంటి ఆధారాలు లభించలేదు. ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఎస్ఈబీ పోలీసులు ఓ వ్యక్తిని పెదకాకానిలో గంటా రాజశేఖర్ ఇంటికి పంపించి క్వార్టర్ బాటిల్ మద్యం కొనుగోలు చేయించి అనంతరం దాడులు చేశారు. ఈ దాడుల్లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓల్డ్ అడ్మిరల్ వీఎస్ఓపీ బ్రాందీ 15 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి గంటా రాజశేఖర్ తమ్ముడు ఫణికుమార్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపించిన మద్యం బాటిళ్లను ఓపెన్ చేసి మొత్తం ఒక పెద్ద ప్లాస్టిక్ క్యాన్‌లో నిల్వచేయడం, థమ్స్‌అప్ ప్లాస్టిక్ బాటిళ్లు, ఏపీకి చెందిన ఖాళీ మద్యం బాటిళ్లలో నింపి అక్రమంగా అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. అనుమానం రాకుండా కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్లాస్టిక్ బాటిళ్లను పసుపుల చావిడి మధ్య కాల్చివేసి ఉండటాన్ని పరిశీలించారు. అక్రమ మద్యం విక్రయిస్తున్న గంటా రాజశేఖర్, ఫణికుమార్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడు రాజశేఖర్‌ను శనివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఈబీ సీఐ ఎం.రమేష్ తెలిపారు. ఫణికుమార్‌ను అరెస్టు చేయాల్సిఉందన్నారు. ఎస్ఈబీ ఏఎస్పీ మహేష్ ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో సీఐలు ఎం.రమేష్, టి.పెదనారాయణస్వామి, ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వందనం

**పెదకాకాని:** జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని పొన్నూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి వందనం అన్నారు. పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి గ్రామంలో శనివారం జగనన్న కాలనీ లేఅవుట్‌ను అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి వందనం మాట్లాడుతూ ఇళ్లు లేని వారికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు గృహ నిర్మాణాలకు రుణాలు కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. సొంత ఇంటి కల నెరవేర్చాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. డ్వాక్రా గ్రూపులో సభ్యులుగా ఉన్న వారికి బ్యాంకు నుంచి రుణం కూడా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ డీఈ కోటేశ్వరరావు, ఏఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు తక్కెళ్లపాడు విద్యార్థులు


హెచ్‌ఎం జీఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులుతో విద్యార్థులు

**పెదకాకాని:** కేంద్ర ప్రభుత్వం ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసిన ఇద్దరు విద్యార్థులు స్కాలర్‌షిప్ పొందేందుకు ఎంపికయ్యారని హెచ్ఎం జీఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. పెదకాకాని మండలం, తక్కెళ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కూచిపూడి అఖిల్‌కుమార్, మంత్రి శరణ్యను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి గాను ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన ఒక్కొక్క విద్యార్థికి ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు స్కాలర్‌షిప్ అందజేస్తుందన్నారు.

# రెండు కార్లు ఢీ


సంఘటనా స్థలంలో నుజ్జయిన కారు

**గుంటూరు రూరల్:** బుడంపాడు సమీపంలోని సెయింట్‌మేరిస్ కాలేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. నల్లపాడు పోలీసు స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి పొన్నూరు వెళుతున్న కారు కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని క్రాస్ చేసే సమయంలో పొన్నూరు నుంచి వస్తున్న కారును ఢీకొట్టింది. అదే సమయంలో పొన్నూరు వైపు నుంచి వస్తున్న పాల ట్యాంకర్, గుంటూరు వైపు నుంచి పొన్నూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు వేగంగా వెళుతూ రెండు కార్లను ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యానాదులకు మెరుగైన విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



**కాకుమాను:** రాష్ట్రంలోని యానాదులకు మెరుగైన విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య అన్నారు. కాకుమాను ఎస్టీ కాలనీలో శనివారం సాయంత్రం యానాదుల సంక్షేమ సంఘం మండల అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో యానాదులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే కానీ ఏ పార్టీ కూడా సముచిత స్థానం కల్పించడం లేదని తెలిపారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్టీలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్‌లో 'రికగ్నిషన్ ఆఫ్ ఎల్‌జీబీటీక్యూఐఏ'పై సదస్సు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న క్వీర్ నిలయం ఫౌండర్ జయంత్ అక జోజో, మధుశాలిని

**చేబ్రోలు:** విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సమస్యలను, మార్పులను ఎదుర్కొనడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని క్వీర్ నిలయం ఫౌండర్ జయంత్ అక జోజో అన్నారు. వివిధ రకాల హార్మోన్ల అసమతుల్యతతో ఎల్‌జీబీటీక్యూఐఏ (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, ఇంటర్‌సెక్స్, క్వీర్/ క్వశ్చనింగ్, అసెక్సువల్) లుగా మారిన మమ్మల్ని ఎవరూ ప్రేమించరన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'రికగ్నిషన్ ఆఫ్ ఎల్‌జీబీటీక్యూఐఏ : ఏ వే ఫార్వార్డ్ ఇన్ 21 సెంచరీ' అనే అంశంపై రెండో జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జయంత్ అక జోజో మాట్లాడుతూ జీవితంలో మీకు నచ్చినట్టు ఉండటంతో పాటు మీకు నచ్చిన పనులను మాత్రమే చేయండని విద్యార్థులకు సూచించారు. తాను 7–12 ఏళ్ల వయస్సు మధ్య కాలంలో ఎన్నో సార్లు లైంగిక వేధింపులను ఎదుర్కొన్నానని పేర్కొన్నారు. క్వీర్ నిలయం వలంటీర్, ట్రాన్స్ ఉమెన్ మధుశాలిని మాట్లాడుతూ హార్మోన్ల అసమతుల్యతతో ఉన్న మమ్మల్ని సాధారణ ప్రజలలాగానే గుర్తించండని అభ్యర్థించారు. అబ్బాయిగా పుట్టిన నేను అమ్మాయిగా మారే క్రమంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలియజేసారు. కార్యక్రమంలో క్వీర్ నిలయం వలంటీర్ హారిక లిల్లీ, లెస్బియన్ ఉమెన్ పాట్రీసియా, వీసీ పి.నాగభూషణ్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీఈసీలో జబర్దస్త్ టీం సందడి

**అట్టహాసంగా కాలేజ్ డే సెలబ్రేషన్స్**



కామెడీ స్కిట్‌లతో అలరిస్తున్న జబర్దస్త్ టీం

**ప్రత్తిపాడు:** యనమదల గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కాలేజ్ డే సెలబ్రేషన్స్ అట్టహాసంగా జరిగాయి. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ హాజరయ్యారు. స్పెషల్ అట్రాక్షన్‌గా సినీనటుడు సంపూర్ణేష్ బాబు, జబర్దస్త్ టీం నూకరాజు, ఇమ్మాన్యుయేల్, తన్మయి, అప్పారావు హాజరై, ఉర్రూతలూగించారు. ప్రత్యేక సరదా స్కిట్లు చేసి అలరించారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన టెక్ వింగ్ ప్రదర్శనల్లో యువత ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ జి.సాంబశివరావు, ప్రిన్సిపాల్ ఎం.రవీంద్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### బైక్ చోరీపై కేసు నమోదు

**చేబ్రోలు:** ఇంజినీరింగ్ విద్యార్థి ద్విచక్ర వాహనం చోరీకి గురవడంపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా చీమకుర్తి ప్రాంతానికి చెందిన మందా నితీష్ వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో చదువుతూ నారాకోడూరులో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. 23వ తేదీ రాత్రి ఇంటి ముందు ఉంచిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ జి.వెంకటాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలి

**పెదనందిపాడు:** గుంటూరు చానల్ విస్తరణ పనులు మొదలుపెట్టాలని, ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. శనివారం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో గుంటూరు చానల్ విస్తరణ పనులు మొదలుపెట్టాలని కోరుతూ రైతులు మొదలుపెట్టిన నిరాహార దీక్షకు వడ్డే శోభనాద్రీశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి గుంటూరు చానల్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆ పనులను మొదలుపెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. అనంతరం రైతులందరూ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ సుభానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్ రావు, జనసేన జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సీపీఎంఎల్ నాయకుడు హరిప్రసాద్, దళిత బహుజన జేఏసీ సమన్వయకర్త చిలకా బసవయ్య, రైతు రక్షణభేరి నాయకుడు రామారావు, పలు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


చరణ్‌సాహో మృతదేహం

**గుంటూరు రూరల్:** లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన చరణ్‌సాహో (30) తన ద్విచక్ర వాహనంపై ఇద్దరు స్నేహితులతో కలిసి గుంటూరు నగరంలోకి వెళుతున్నాడు. అదే సమయంలో మిర్చి యార్డు సమీపంలోని సుబ్బారెడ్డినగర్ వద్ద లారీలోని మిర్చిలోడును దించుకుని డ్రైవర్ వాహనాన్ని రివర్స్ చేసుకుంటున్నాడు. వేగంగా వచ్చి ద్విచక్ర వాహనం రివర్స్ చేసుకుంటున్న లారీని వెనుకభాగంలో ఢీకొంది. ప్రమాదంలో చరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన మరో ఇద్దరిని 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నల్లపాడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జీజీహెచ్ మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**చేబ్రోలు:** కుక్క అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురికావడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద శనివారం జరిగింది. చిలకలూరిపేటకు చెందిన పి.అశోక్‌కుమార్, ఎం.కాంతయ్య పాతరెడ్డిపాలెంలోని దినకర్మకు వచ్చారు. అనంతరం బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ సమీపంలో ప్రధాన రహదారిపై కుక్క అడ్డురావడంతో దానిని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో గాయాలైన ఇద్దరిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### నేడు ధర్మ చైతన్య సాహితీ సభ

**పాత గుంటూరు:** రవీంద్రనగర్ నాలుగో లైనులోని కుర్తాళ శ్రీసిద్ధేశ్వరీ పీఠ మంత్రాశ్రమంలో కుర్తాళం శంకరాచార్య జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 87వ వసంతోత్సవంలో భాగంగా ఆదివారం ధర్మ చైతన్య సాహితీ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి. హైమానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సభకు శ్రీ నరసింహానంద భారతీ స్వామి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ సిద్ధేశ్వరానంద భారతీమహాస్వామి పాల్గొని అనుగ్రహభాషణం చేస్తారని తెలిపారు. అనంతరం సాహితీ గోష్టిలో అనేక మంది కవిపండితులు పాల్గొంటారని వెల్లడించారు.

### 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి

**నెహ్రూనగర్:** వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చిన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ కోరారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకుండా మాదిగల్ని మోసం చేసిందని విమర్శించారు.